కళ్ల ముందే కలల సౌధం


పూర్తయిన టిడ్కో ఇళ్లు




ఆకట్టుకుంటున్న హాలు

సొంత ఇల్లు ప్రతీ ఒక్కరి కల. పైసా... పైసా కూడబెట్టి కట్టుకున్న ఇంట్లో కుటుంబంతో హాయిగా జీవించాలని ఆకాంక్షిస్తారు. దాని కోసం ఎంతో శ్రమిస్తారు. అయితే పేదల సొంతింటి కల తీర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించారు. దీనిలో భాగంగా ఆధునిక వసతులతో.. అందరికీ నచ్చేలా టిడ్కో గృహాలను తీర్చిదిద్దారు. త్వరలో వాటిని లబ్ధిదారులకు అందజేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

- పంపిణీకి సిద్ధంగా టిడ్కో గృహాలు
- అన్ని వసతులతో నిర్మాణాలు పూర్తి
- చకచకా రిజిస్ట్రేషన్లు
- త్వరలో లబ్ధిదారుల చేతికి తాళాలు

పద్మనాభనగర్‌లో 14 బ్లాకుల్లో నిర్మించిన ఇళ్ల వివరాలు

430 చదరపు గజాల్లో 432 ఇళ్లు | 365 చదరపు గజాల్లో 366 ఇళ్లు

300 చదరపు గజాల్లో 48 ఇళ్లు నిర్మించారు.

గృహ విస్తీర్ణం	నిర్మాణ వ్యయం	నిర్ణయించిన ధర
300 చదరపు గజాలు	రూ.6.55లక్షలు	రూ.500
365 చదరపు గజాలు	రూ.7.55లక్షలు	రూ.3.15లక్షలు
430 చదరపు గజాలు	రూ.8.55లక్షలు	రూ.3.65లక్షలు

గోపాలపట్నం: రాష్ట్రంలోని ఏ పేద కుటుంబం సొంత గూడు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకనుగుణంగా పేదలకు సొంతిళ్లు నిర్మించి అందించాలని సంకల్పించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులందరికీ గృహయోగం కల్పించారు. మరోవైపు ఏపీ టిడ్కో హౌసింగ్ స్కీం ద్వారా గృహ సముదాయాలు నిర్మించి అందజేస్తున్నారు. 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా, 365, 430 చదరపు అడుగుల ఇళ్లను రాయితీపై అందిస్తున్నారు.

త్వరలోనే లబ్ధిదారుల చేతికి తాళాలు

పద్మనాభ నగర్‌లో 14 బ్లాకుల్లో టిడ్కో గృహ సముదాయాలు చేపట్టారు. ఇళ్లకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేశారు. వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి తాగునీటి సదుపాయం కల్పించే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రోడ్లు నిర్మిస్తున్నారు. చిన్న చిన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు షురూ

మొత్తం 856 ఇళ్లకు గాను బ్యాంక్ లోన్ వచ్చిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటికే 350 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. బ్యాంక్ లోన్ మంజూరైన వెంటనే మిగిలిన వారికి కూడా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి జియో ట్యాగింగ్

రిజిస్ట్రేషన్ పూర్తయిన లబ్ధిదారుల ఆధార్ కార్డులతో అనుసంధానం చేస్తూ మంగళవారం జియో ట్యాగింగ్ చేస్తామని ఏపీడీ శ్రీరామ్ తెలిపారు. త్వరలో వీరికి ఇళ్లు అందిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ఆర్పీలు సమాచారం చేరవేస్తున్నారు.

రూపాయికే రిజిస్ట్రేషన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయికే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు అప్పగిస్తోంది. పేదలపై ఎటువంటి ఆర్థిక భారం పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని కారణంగా వారంతా సంతోషంగా ఉన్నారు.

ఎదురు చూస్తున్నాం



ఎన్నాళ్ల నుంచో సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం. మరి కొద్ది రోజుల్లో మా కల నెరవేరనున్నందుకు చాలా ఆనందంగా ఉంది. లబ్ధిదారులకు ఫ్లాట్లు చూపించే ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు సమాచారం ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. మాకూ సొంత ఇల్లు రాబోతుంది. అద్దె బెడద తీరిపోతుంది.

అడపా సత్యవతి, పాత గోపాలపట్నం

కల నెరవేరే రోజు వచ్చింది



మా సొంతింటి కల నెరవేరబోతోంది. మాయ మాటలకు మోస పోయామనుకున్నాం. జగనన్న ఇల్లు కట్టి ఇచ్చాడు. మా కష్టాలు తీరినట్లయింది. జియో ట్యాగింగ్ చేసిన తర్వాత మా సొంతమవుతుంది. ఎపుడు మా ఇంట్లో అడుగుపెడతామా అని పట్టలేని ఆనందం వస్తోంది.


– బమ్మిడి ఉమా మహేశ్వరి, పాత గోపాలట్నం


చురుగ్గా సాగుతున్న రహదారుల నిర్మాణం


తుదిదశకు చేరుకున్న నిర్మాణాలు


సిద్ధమైన ఒకటో బ్లాక్

పేదలకు పండగ



పేదల కల కొద్ది రోజుల్లో తీరనుంది. మంగళవారం జరిగే జియో ట్యాగింగ్ వారికి పండగలాంటిదే. లబ్ధిదారులకు మంజూరైన ఫ్లాట్ ఎక్కడుందో ఎలా ఉందో చూసుకునే సమయమొచ్చింది. త్వరలోనే అన్ని సదుపాయాలతో ఇంట్లో దిగే పెద్ద పండగ త్వరలోనే జరగబోతుంది.

– గుణిశెట్టి శ్రీనివాసరావు, 91వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

క్లుప్తంగా

అయోధ్య అక్షింతల కలశానికి పూజలు


అక్షింతల కలశానికి పూజ చేస్తున్న ఆలయ నిర్వాహకులు

విశాఖ విద్య: అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతల కలశానికి ఎస్‌ఏడీ బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ–బంగారమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రామచంద్రస్వామి వారి అక్షింతలతో కూడిన కలశానికి త్రివేణి గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సోమవారం నుంచి ఈ నెల 31 వరకు ఆలయంలో ఈ కలశానికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అక్షింతలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద సోమవారం సాయంత్రం అయ్యప్ప భక్తుడు చట్టి శివయాదవ్ ఆధ్వర్యంలో అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాపురం,ఆర్కేపురం,వెంకన్నపాలెం ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. స్వామి పీఠం ముందు 18 మెట్లు ఏర్పాటు చేసి,ప్రతి మెట్టుకు నెయ్యితో చేసిన దీపాలు వెలిగించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ కీర్తనలు ఆలపించారు. అనంతరం స్వాములతో పాటు భక్తులకు ప్రసాదం అందజేశారు.

భాగ్యలక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం


పురస్కారంతో భాగ్యలక్ష్మి

మల్కాపురం: స్థానిక సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాల అధ్యాపకురాలు, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం లభించింది. స్త్రీ వన్ ఇండియా ఏటా ఇచ్చే విమన్ అచీవర్స్–2023 అవార్డులను వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 26 మంది మహిళలకు ప్రదానం చేశారు.వీటిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జీవన సాఫల్య పురస్కారం భాగ్యలక్ష్మికి వరించడంపై పలువురు అభినందనలు తెలిపారు. భాగ్యలక్ష్మి 30 ఏళ్లుగా విద్య,యువజన,సామాజిక సేవా రంగాల్లో అందించన సేవలకు గుర్తుగా ఈ పురస్కారం లభించింది. ఈ మేరకు సోమవారం ఆమెను కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

రుక్మాకరరావుకు డాక్టరేట్



గోపాలపట్నం: క్రీడల్లో విశేష సేవలు అందిస్తున్న పాండ్రంకి రుక్మాకరరావుకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. విజయవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రుక్మాకరరావు పేదలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి దేశ విదేశాలకు పంపించి పథకాలు సాధించేందుకు దోహదపడుతున్నారు. పలువురు బాల బాలికలకు బాక్సింగ్, రెజ్లింగ్, జూడో,తైక్వాండో వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. తాను చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్ అందించిన యూనివర్సిటీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల ఆశీర్వాదం సీఎం జగన్‌కే..

- ప్రతి పేదవాడి గుండెలో సుస్థిర స్థానం
- వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్

మల్కాపురం: మనసున్న గొప్ప మనిషి మన సీఎం జగన్.. సంక్షేమ ప్రదాతకు ప్రజల ఆశీర్వచనాలు నిండుగా ఉన్నాయి.. కుట్రలు పన్నే వారితో మనకు పని లేదని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వ లేక విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. జీవీఎంసీ 61వ వార్డు గాంధీవీధి 344 సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. బద్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ,40,62,63వ వార్డుల పార్టీ పరిశీలకుడు భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొని తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బద్రీనాథ్ ప్రసంగించారు. పార్టీలు చూడకుండా ప్రతి గడపకు సంక్షేమ ఫలం అందుతుందంటే అది సీఎం జగన్ మంచి మనసుకు నిదర్శనం అన్నారు. అలాంటి వ్యక్తి మరలా ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు పేదల క్షేమంగా ఉంటారన్నారు. కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ 344 సచివాలయం పరిధిలో సుమారు 1050 కుటుంబాలు ఉండగా.. సుమారు 800 కుటుంబాలకు ఇప్పటి వరకూ సంక్షేమ పథకాల రూపంలో రూ. 17 కోట్లు అందించినట్టు చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడే మన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరలా అంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, 61,62వ వార్డుల పార్టీ అధ్యక్షులు జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు)భీశెట్టి గణేష్,ఎన్.వి.రమణ,వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు


ఆనంద్‌కుమార్‌కు స్వామి వారి శేష వస్త్రాలు అందిస్తున్న అర్చకుడు


ప్రశాంతినగర్‌లో శ్రీ వల్లీ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ రామాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కనులపండువగా కార్తికేయుడి కల్యాణం

గోపాలపట్నం: సుబ్రహ్మణ్య షష్ఠిని గోపాలపట్నం ప్రశాంతినగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ప్రాంగణంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవతామూర్తులకు పంచామృత, క్షీరాభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని, దేవేరులను దర్శించుకున్నారు. పూజల్లో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని స్వామి వారికి కన్యాదానం చేశారు. కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ఆడారి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: ఎస్ఏడీ సెంటర్‌లోని ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకున్నారు. అర్చకులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి శేషవస్త్రాలు అందించి, ఆశీర్వదించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్. కృష్ణ , మారుతిపాల్గొన్నారు.

సందడిగా క్రిస్మస్


కేక్ కట్‌చేస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్రకాలనీలో ప్రీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల పైడిరాజు, షేక్ రహమాన్, చిన్ని, కిరణ్, సత్యనారాయణ, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


కార్పొరేటర్ నాగేశ్వరరావుకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో నూతనంగా ఎన్నికైన రాంజీ భీమ్ రావ్ ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. నూతన కార్యవర్గ సభ్యులకు కార్పొరేటర్ నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. సభ్యులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు. సంఘ అధ్యక్షుడు దేబార్కి కృష్ణ, కార్యవర్గ సభ్యులు జామి కృష్ణ, తంబూరి గణేష్, వందన నాగరాజు, తంప మోహన్, రాంప్రసాద్, విమల, యశోద పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'గడప గడపకు..'


విద్యానగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: 'మీ సమస్యలు తెలుసుకునేందుకు మీ గడప వద్దకు వచ్చాం.. సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీ వద్దకు పంపించారు' అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 91వ వార్డు విద్యానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఎంతో మంది పేదల అభ్యున్నతికి దోహదపడుతున్నాయన్నారు. పథకాల అమల్లో ఎక్కడా అవినీతికి తావు లేకుండా, నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లోనే జమ అవుతున్నాయన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల పత్రాలను అందించారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, డానియేల్, కడితి రాజు, చెంగల హరినాథ్, దేరెడ్ల సత్యనారాయణ, కడితి భాగ్యలక్ష్మి, కొండబాబు, జి.వి.రమణ, ఊటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు వరం వైఎస్సార్ బీమా


మృతుని కుటుంబానికి బీమా తక్షణ సాయం అందిస్తున్న రామ్మోహనరెడ్డి

సింధియా: వైఎస్సార్ బీమా పథకం పేద ప్రజలకు వరంలాంటిదని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. క్రాంతినగర్‌కు చెందిన రాము రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడు వైఎస్సార్ బీమాను కలిగి ఉండడంతో సోమవారం మృతుడి భార్య ఆదిలక్ష్మికి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి తక్షణ సాయం కింద రూ. 10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ మిగిలిన రూ.4.90 లక్షలు మృతుని నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.కె.నాయుడు, సూరాడ పెంటారావు, రమణ, రాంబాబు, సుజాత, క్రాంతినగర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ షెల్టర్ నుంచి కుటుంబీకుల చెంతకు..


ఒడిశాలోని కుటుంబీల చెంతకు చేరిన అజిత్ (పసుపు రంగు టీ షర్ట్ వేసుకున్న వ్యక్తి)

విశాఖ విద్య: అనాథగా వచ్చిన వ్యక్తికి ఆశ్రయం కల్పించి, ఒడిశాలో ఉన్న తన కుటుంబీకుల చెంతకు చేర్చారు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ ప్రతినిధి ఎల్లేటి మమత. వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల కిందట ఒంటి నిండా గాయాలతో ఉన్న ఒక వ్యక్తి తనకు ఎవరూ లేరని చెప్పడంతో, మమత అతడిని కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. అనంతరం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. అనంతరం వివరాలు సేకరించగా తన పేరు అజిత్ అని, ఒడిశా నుంచి వచ్చానని చెప్పడంతో కుటుంబీకుల గురించి ఆరా తీశారు. ఆ వివరాల ఆధారంగా ఒడిశాలో ఉన్న కుటుంబీకుల చెంత శ్రద్ధ ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా పంపించారు. తొమ్మిదేళ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తి ఇంటికి రావటంతో అతడి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.